మీదికొస్తేనే.. యాదికొస్తది.!

- నగరంలో నేపాలీల లెక్కల కోసం పోలీసుల హడావుడి

జూబ్లీహిల్స్, మే 8, ప్రభాతవార్త: ఏదైనా మీదికి రావాలి.. అప్పుడే అసలు విషయం యాదికొస్తుంది.. నగరంలో చాలా కాలంగా నేపాలి ముఠాలు రెచ్చిపోతున్నాయి.. ఎప్పటికప్పుడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయడం, విమానాలెక్కించి సరిహద్దులకు తరలించడం.. పట్టుబడే నగలు, నిందితులను అరెస్ట్ చూపడం.., ఇంతవరకు బాగానే ఉంది. కాని, నేపాలీ ముఠాల ఆగడాలు, దోపిడీలు చాలా కాలంగా జరుగుతున్న పోలీసు ఉన్నతాధికారుల వద్ద ఇప్పటివరకు నగరంలో ఉన్న నేపాలీల సంఖ్యలో స్పష్టత లేకపోవడం గమనార్హం. శుక్రవారం మాజీ అదనపు డీజీపీ సతీమణిని నేపాలి ముఠా దోపిడి నేపథ్యంలో హతమార్చడంతో మరోసారి నేపాలీ పనిమనుషుల వ్యవహారం తెరమీదకొచ్చింది. ఇందుకోసం శుక్రవారం నేపాలీల సంఖ్యను తేల్చాలంటూ కింది స్థాయి సిబ్బందితో ఉన్నతాధికారులు సమీక్షాసమావేశం ఏర్పాటుచేశారు.

జూబ్లీహిల్స్ లోనే వరుస సంఘటనలు

ఈ ఏడాది మొదటి అయిదు నెలల్లోనే మూడు వరుస దోపిడి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ మూడింటిలోనూ నేపాలి ముఠాల ప్రమేయం ఉంది. ఫిబ్రవరిలో జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ లో జరిగిన సంఘటనలో వ్యాపారి రవీంద్ర శర్మ నివాసంలో వంటమనిషిగా పనిచేసే నేపాల్‌కు చెందిన భూపేందర్ షాహి తన అనుచర ముఠాతో కలిసి దోపిడికి పాల్పడ్డాడు. ఇంట్లోని పనిమనుషులకు మత్తు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి కాళ్లు, చేతులు కట్టేసి దాదాపు రూ. 2కోట్లకు పైగా నగలు, నగదు దోచేకెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నేపాల్ సరిహద్దులో కాపుకాసి నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు మినహా మిగిలిన నిందితులను పోలీసులు పటుకున్నారు. సరిగా నెల తిరక్కముందే మార్చిలో జూబ్లీహిల్స్ ఎంపీఎమ్మెల్యే కాలనీలో నివసించే వ్యాపారి అనిరుద్‌రెడ్డి, దీపికారెడ్డి నివాసంలో పనిచేసే నేపలి జంట మహేష్ షాహి, అప్సర చాంద్‌లు సైతం ఇలానే మరో ఇద్దరితో కలిసి ముఠాగా ఏర్పడి యజమాని ఇంట్లో చోరికి పాల్పడ్డారు. ఇంట్లోని నగలు, నగదు తీసుకొని ఉడాయించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి చోరీ చేసిన ముఠాలోని ఒకరిద్దరిని అరెస్ట్ చేయడమే కాకుండా కొంత నగదును తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితులు సరిహద్దు దాటి పోవడంతో వారిని పట్టుకోలేకపోయారు. తాజాగా ప్రశాసన్‌నగర్‌లో నివసించే మాజీ డీజీపీ వినయ్ రంజన్ రే నివాసంలోనూ పని చేస్తున్న నేపాల్‌కు చెందిన కల్పన మరో ముగ్గురితో ముఠాగా ఏర్పడి గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత దోపిడికి పాల్పడ్డారు. ఈ క్రమంలోనే మాజీ డీజీపీ సతీమణి తనూజ రంజన్‌ను హత్య చేశారు. భారీగా నగలు, నగదు సంచులతో పరారయ్యారు. ఈ మూడు సంఘటనలే కాకుండా నగరంలో నేపాలి ముఠాలకు సంబంధించి మరిన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే సంఘటన జరిగినప్పుడు హడావుడి చేసే పోలీసులు నేపాలీల లెక్కను తేల్చకపోవడం గమనార్హం.

ఒంటరితనాన్ని లక్ష్యంగా చేసుకొని..

యజమానుల ఇళ్లలో నమ్మకంగా పనికి కుదిరే నేపాలీలు యజమానుల కదలికలను పూర్తిస్థాయిలో గమనిస్తుంటారు. కొద్ది రోజుల్లోనే యజమానులకు దగ్గరవ్వడమే కాకుండా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మారేంతగా ప్రవర్తిస్తారు. దీంతో చాలా మంది యజమానులు వారిని గుడ్డిగా నమ్మడం, ఇంటి బాధ్యతలు వారికి అప్పగించడం చేస్తున్నారు. దీంతో యజమానులు ఒంటరిగా ఉండటాన్ని గమనించి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తమ ముఠాను రంగంలోకి దించి దోపిడీలకు పాల్పడుతున్నారు. నందగిరిహిల్స్ లో ఇంటి కుటుంబ సభ్యులంతా బయటకు వెళ్లడంతో, ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో ఇంటి యజమానురాలు ఒక్కతే ఉండటం, మరో ప్రాంతానికి వెళ్లడంతో, తాజాగా మాజీ డీజీపీ సతీమణి సైతం ఇంట్లోని ఒక అంతస్థులో ఒక్కతే ఉండటంతో నేపాలి ముఠాలు దోపిడీలకు పంజా విసిరాయి. గతంలో బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోనూ ఇలానే ఒక వ్యాపారి ఇంట్లో చోరి వ్యవహారంలో అప్పటి బంజారాహిల్స్ డిఐ, ప్రస్తుత కూకట్‌పల్లి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై భరత్‌భూషణ్‌లు దాదాపు నాలుగు నెలల పాటు శ్రమించి బీహార్‌కు వెళ్లారు. అక్కడ మట్టిలో, గోడల్లో దాచిపెట్టిన దాదాపు రూ. 10కోట్ల విలువైన బంగారు ఆభరణాలను వెనక్కి తీసుకురావడానికి అష్టకష్టాలు పడ్డారు. కాగా తాజాగా ఇప్పుడు నగర పోలీసులు మరోసారి నేపాలీల సంఖ్యపై దృష్టి పెట్టారు. గతంలో నామమాత్రంగా కొన్ని జోన్లలో చేసిన లెక్కల ప్రకారం దాదాపు 1200ల నుంచి 1500ల మంది పనిమనుషులుగా చేస్తున్నట్లు గుర్తించారు. కాగా నగర వ్యాప్తంగా చూస్తే పనిచేసే వారి సంఖ్య దాదాపు అయిదువేల వరకు ఉండవచ్చని ఒక పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. అయితే వీరికి సంబంధించిన వివరాలు, ధృవీకరణ పత్రాలు లేకపోవడం, యజమానులు తీసుకోకపోవడంతో అసలు సమస్యలు తలెత్తుతున్నాయి. తాజా సంఘటనతో పోలీసులు నేపాలీ పనిమనుషుల సంఖ్యను లెక్కకట్టడంతోపాటు పనిలో కుదిర్చే నేపాలీల వివరాలను, గుర్తింపు కార్డులను తీసుకొనేందుకు సిద్ధమవుతున్నారు.



మాజీ అదనపు డీజీపీ నివాసం వద్ద ముందు రోజు రెక్కి నిర్వహించిన నేపాలీలు

హైదరాబాద్ వార్త

పునరుద్ధరణ సరే.. మెయింటెనెన్స్ ఎవరిదీ?

-హైడ్రా అధ్వర్యంలో పలు చెరువుల అభివృద్ధి
-చుట్టూ వాక్‌వేలు, ఓపెన్ జిమ్‌లు, ప్లేఏరియా ఏర్పాటు
-నిర్వాహణపై స్పష్టత లేక జిహెచ్ఎంసి-హైడ్రా మల్లగుల్లాలు

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త: ఒకప్పుడు ఆక్రమణలు, చెత్త, మురుగుతో కనిపించిన హైదరాబాద్ చెరువులు.. ఇప్పుడు హైడ్రా చర్యలతో సరికొత్త అందాన్ని సంతరించుకుంటున్నాయి. కోట్ల రూపాయలతో ఆధునికంగా అభివృద్ధి చేసిన ఈ చెరువుల నిర్వహణ ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. పాడైపోయిన తటాకాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన హైడ్రాకే నిర్వహణ బాధ్యతలు అప్పగించాలా..? లేక నిబంధనల ప్రకారం గతంలో చెరువులను నిర్వహించిన బల్దియాకు ఇవ్వాలా..? అన్నదానిపై స్పష్టత రావడం లేదు. మరోవైపు.. గతంలో బల్దియా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు చెరువులు కబ్జాలకు గురవ్వడంతో.. ఇప్పుడు వాళ్ళకి అప్పగిస్తే మళ్లీ అదే పరిస్థితి రాకూడదని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని చెరువులకు ఇప్పుడు కొత్త అందం వచ్చింది. ఒకప్పుడు చెత్త, మురుగు, ఆక్రమణలతో కనిపించిన తటాకాలు.. ఇప్పుడు కుటుంబాలతో వెళ్లి సేదతీరే ప్రదేశాలుగా మారాయి. హైడ్రా ప్రత్యేక చర్యలతో చెరువుల చుట్టూ వాక్‌వేలు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్లే ఏరియాలు, సిటౌట్లు, గ్రీనరీ, లైటింగ్ ఏర్పాటు చేశారు. అంబర్‌పేట్ బతుకమ్మకుంటను 7 కోట్ల 40 లక్షలతో, పాతబస్తీ బమ్‌రుక్‌నుద్దౌలా చెరువును 10 కోట్లతో, కూకట్‌పల్లి నల్లచెరువును 20 కోట్లతో అభివృద్ధి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ప్రాజెక్టులను ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నిర్వాహణపై మల్లగుల్లాలు..

అయితే ఇప్పుడు అసలు సమస్య చెరువుల మెయింటెనెన్స్ నిర్వహణపైనే.. చెరువులను హైడ్రా అభివృద్ధి చేసినా.. నిబంధనల ప్రకారం వాటి సంరక్షణ బాధ్యత జీహెచ్‌ఎంసీదే. కానీ బల్దియా మాత్రం డెవలప్ చేసింది హైడ్రానే కాబట్టి మెయింటెనెన్స్ కూడా వాళ్లే చూసుకోవాలి అన్న వైఖరిలో ఉందన్న చర్చ జరుగుతోంది. మరోవైపు హైడ్రా అధికారులు మాత్రం నిర్వహణ మా పరిధిలో లేకపోయినా... ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు, సిబ్బంది ఇస్తే నిర్వహణకు సిద్ధమని చెబుతున్నారు. చెరువుల వద్ద 24 గంటల భద్రత, మూడు షిఫ్టుల్లో సెక్యూరిటీ, విద్యుత్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ, ఉద్యాన సంరక్షణ వంటి ఖర్చులు భారీగా ఉంటున్నాయని చెబుతున్నారు. అయితే గత అనుభవాలే ఇప్పుడు ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయి. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న పలు చెరువులు కబ్జాలకు గురయ్యాయి. కొన్ని కార్పొరేట్ సంస్థలు చెరువులను అభివృద్ధి చేస్తామని తీసుకుని.. అక్కడే తమ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టిన ఘటనలు వెలుగుచూశాయి. కొన్ని చోట్ల చెరువు భూముల్లో ఆయా సంస్థలు క్యాంపస్ విస్తరణలు జరిగితే.. మరికొన్ని ప్రాంతాల్లో నేరుగా అప్రోచ్ రోడ్లు వేసిన ఘటనలూ ఉన్నాయి. అయినా అప్పట్లో జీహెచ్‌ఎంసీ అధికారుల సరైన పర్యవేక్షణ జరగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు కోట్ల రూపాయల ప్రజాధనంతో అభివృద్ధి చేసిన చెరువులు మళ్లీ నిర్లక్ష్యానికి గురికాకూడదని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు చెరువులను డెవలప్ చేసిన హైడ్రానే నిర్వహిస్తేనే అవి భద్రంగా ఉంటాయి అని స్పష్టం చేస్తున్నారు.

హైడ్రా అయితేనే మేలు..

చెరువుల నిర్వహణపై స్పష్టమైన పాలసీ అవసరమని అధికారులు చెబుతున్నారు. అభివృద్ధి ఒక శాఖ చేస్తే.. నిర్వహణ మరో శాఖ చూసే విధానం వల్ల బాధ్యతలు గందరగోళంగా మారే ప్రమాదం ఉందంటున్నారు. ప్రత్యేక లేక్ ప్రొటెక్షన్ అథారిటీ, ప్రత్యేక మెయింటెనెన్స్ ఫండ్ ఏర్పాటు చేయాలని అభిప్రాయపడుతున్నారు. లేదంటే ఇప్పుడున్న అందమైన చెరువులు కొన్నేళ్లలోనే మళ్లీ ఆక్రమణలు, నిర్లక్ష్యం, మురుగుతో పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్‌లో చెరువుల సుందరీకరణ కు ప్రశంసలు వస్తున్న వేళ.. వాటి భవిష్యత్ నిర్వహణపై స్పష్టత లేకపోవడం ఇప్పుడు కొత్త చర్చకు దారితీస్తోంది. అభివృద్ధి చేసిన చెరువులు అదే స్థాయిలో కొనసాగుతాయా..? లేక మళ్లీ నిర్లక్ష్యానికి గురవుతాయా..? అన్నది ఇప్పుడు నగర ప్రజల్లో పెద్ద చర్చగా మారింది.

నెల రోజుల్లో కృష్ణానగర్ వరదకు పరిష్కారం

-కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరం - హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త:
ప్రతి ఏటా వరద ముప్పును ఎదుర్కొంటున్న కృష్ణానగర్ పరిసరాలకు ఈ ఏడాది ఉపసమనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. పైనుంచి భారీ మొత్తంలో వచ్చిన వరద సాఫీగా సాగేలా కాలువల్లో పూడిక తీత పనులను ముమ్మరం చేశామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ , జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్‌లతో కలిసి కృష్ణానగర్‌లో పూడిక తీత పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కృష్ణానగర్‌లో దాదాపు ఒకటిన్నర కిలోమీటర్లున్న వరద కాలువను పూర్తిగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నాలాల్లో పూడికతీత పనుల్లో జీహెచ్ ఎంసీతో హైడ్రా భాగస్వామ్యమైందన్నారు. కృష్ణానగర్ వరద ముప్పు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎగువ ప్రాంతాలైన జూబ్లీహిల్స్, వెంకటగిరి నుంచి వరదతో పాటు వచ్చిన మట్టి కృష్ణానగర్ వరద కాలువల్లో పేరుకుపోవడంతో సమస్య తలెత్తుతోందని..స్థానిక ఎమ్మెల్యే ప్రత్యామ్నాయంగా వరద కాలువ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

అవసరమైన మేరకు స్లాబ్‌లను తొలగిస్తాం..

ఆరేడు అడుగుల మేర పూడిక పేరుకుపోవడంతో కాలువలు దాటి వరద రహదారులను ముంచెత్తుతోందని రంగనాథ్ తెలిపారు. 8 నుంచి 9 అడుగుల లోతులో ఉన్న వరద కాలువల్లో పూడికను తొలగించడానికి వీలు లేని పరిస్థితులున్నాయని అన్నారు. అవసరమైన మేరకు స్లాబులను తొలగించి పూడికను పూర్తి స్థాయిలో తొలగిస్తామన్నారు. ఒకటి రెండు ఇళ్లు కూడా పూర్తిగా నాలాపై నిర్మించినట్టు గుర్తించామని.. తొలగించక తప్పనిసరి పరిస్థితి ఉంటేనే చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇచ్చి.. తగిన సమయం కూడా ఇస్తామన్నారు. 2021లో పూర్తి స్థాయిలో పూడిక తీశారని.. తర్వాత ఆ స్థాయిలో పని జరగలేదని స్థానికులు చెబుతున్నారని తెలిపారు. గతేడాది వర్షాకాలంలో హైడ్రా మెట్ టీమ్‌లు చాలా వరకు పూడికను తొలగించినా.. పూర్తి స్థాయిలో సాధ్యం కాలేదని గుర్తు చేశారు. అందుకే వేసవి కాలంలోనే ఈ పనులు ప్రారంభించి వర్షాకాలం ఆరంభానికి పూర్తి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. స్లాబులు తొలగించిన దగ్గర వరద కాలువలపై బలమైన గ్రిల్స్ ఏర్పాటు చేసి ప్రమాదానికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతోపాటు హైడ్రా, జీహెచ్ ఎంసీ, జలమండలి అధికారులు ఉన్నారు.

నాలాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ తదితరులు

అభివృద్ధి పనుల్లో పారదర్శకత.. క్యూఆర్ కోడ్‌తో వివరాలు

-ప్రతి పౌరుడు స్వీయ జనగణనలో పాల్గొనాలి
-దోమల నివారణకు పకడ్బందీ చర్యలు
-మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్ మే 08 (ప్రభాతవార్త) : మల్కాజ్‌గిరి మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పూర్తి పారదర్శకతను పాటించేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఖీ99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికఖీలో భాగంగా శుక్రవారం ఆయన వనస్థలిపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఎఫ్‌సీఐ కాలనీలో కొనసాగుతున్న వరద నీటి కాలువ పనులను పరిశీలించిన కమిషనర్, అక్కడ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ వ్యవస్థను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పనుల వివరాలను చేరవేసేందుకు ఈ టెక్నాలజీని వాడుతున్నట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా కాంట్రాక్ట్ వివరాలు, బడ్జెట్ కేటాయింపులు, గడువు మరియు సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల వివరాలు ప్రజలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఎఫ్‌సీఐ కాలనీ పార్కులో నిర్వహించిన స్వీయ జనగణన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా జనగణన ప్రక్రియలో పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కాలనీ పార్కులో పచ్చదనం పెంచడంతో పాటు చిన్నారుల కోసం మరిన్ని ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో వ్యాధులు ప్రబలకుండా యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేయాలని ఎంటమాలజీ విభాగ అధికారులకు సూచించారు. దోమల నివారణ చర్యల్లో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. అంతకుముందు వనస్థలిపురం వార్డు కార్యాలయం, లైబ్రరీ హాల్, యోగా సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మోడల్ మార్కెట్‌లో తమకు ఒక దుకాణం కేటాయించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా కార్పొరేషన్ పరిధిలో నాలాల పూడికతీత పనులు వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే 1.56 కిలోమీటర్ల మేర డిసిల్టింగ్ పనులు పూర్తి చేశారు. నాలాలను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేశామని, అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికఖీలో భాగంగా వనస్థలిపురం పరిధిలోని వివిధ ప్రాంతాలలో పర్యటించిన మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

బిల్డింగ్ అనుమతుల్లో జాప్యం చేయొద్దు

-టౌన్‌ప్లానింగ్ అధికారులకు సిఎంసి కమిషనర్ సృజన ఆదేశం

హైదరాబాద్,మే 8,ప్రభాతవార్త: బిల్డింగ్ అనుమతుల్లో ఎలాంటి జప్యం లేకుండా దరఖాస్తు అందిన వెంటనే పరిశీలించిన నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం సిఎంసి ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని జోన్లలో పనుల గడువు, పారదర్శకత, క్షేత్రస్థాయి అమలుపై చర్చించారు. సమావేశంలో దరఖాస్తుల స్థితిగతులు, ఆక్రమణల తొలగింపు పెండింగ్ అంశాలను నిశితంగా సమీక్షించారు. భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు, టీడీఆర్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు గురించి చర్చిస్తూ, కౌంటర్ అఫిడవిట్లను సకాలంలో దాఖలు చేయాలని నిరంతరం ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ భూముల్లో ఉన్న ఆక్రమణల తొలగింపు పనులను సమీక్షించారు.ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అలాగే ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో భూసేకరణ పనులకు ఉన్న అడ్డంకులను తొలగించి, రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. అంతేకుఆండా ప్రజల భద్రత దృష్ట్యా శిథిలావస్థకు చేరిన ప్రమాదకరమైన భవనాలపై తీసుకున్న చర్యలపై ఆరాతీశారు.నిర్ణయాలు వేగంగా తీసుకోవడానికి టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, లీగల్ విభాగాల మధ్య సమన్వయాన్ని పటిష్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిటీ చీఫ్ ప్లానర్ (సిపిపి) వెంకన్న, మూడు జోన్లకు చెందిన సిటీ ప్లానర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జి.సృజన, సిసిపి వెంకన్న తదితరులు

నేపాలీ పనిమనుషులతో జర జాగ్రత్త

-సిపి సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త

నగరంలోని అత్యంత లగ్జరీ అండ్ సెక్యూరిటీ ఎక్కువగా ఉండే ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, పోలీసులు దీనిని హత్యగా నిర్ధారించారు. ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ పనిమనిషే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. నిందితులు అత్యంత క్రూరంగా ఈ హత్యకు పాల్పడ్డారు. బాధితురాలి నోట్లో గుడ్డలు కుక్కి, ఆమె గట్టిగా కేకలు వేయకుండా అడ్డుకుని, ఊపిరాడకుండా చేసి ప్రాణాలు తీశారని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, కేవలం దోపిడీ కోసమే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోందని, హత్య అనంతరం నిందితులు పరారయ్యారని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా నేపాలీ పనిమనుషులను ఇంట్లో పెట్టుకునే వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. నేపాలీ గ్యాంగ్‌లు తరచుగా ఇలాంటి నేరాలకు పాల్పడుతుంటాయని, వారు ఇంట్లో నమ్మకంగా ఉంటూనే యజమానుల కదలికలపై నిఘా పెడతారని సీపీ తెలిపారు. సరైన అవకాశం దొరికినప్పుడు దొంగతనం లేదా హత్యలకు వెనుకాడరని హెచ్చరించారు. ఇంట్లో పనిమనుషులు ఏం చేస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? అనే విషయాలపై యజమానులు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. నేపాలీ లేదా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పనిమనుషులను విధుల్లోకి తీసుకునే ముందు వారి ఆధార్ కార్డ్, ఫోటోలు, పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో అందజేసి పోలీస్ వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు. కాగా.. రిటైర్డ్ ఉన్నతాధికారి ఇంట్లోనే ఇలాంటి ఘటన జరగడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

రాత్రి మాజీ అదనపు డిజిపి పీఎస్ఓ ఏమయ్యాడు..!

- ఆరా తీస్తున్న పోలీసులు!

జూబ్లీహిల్స్, మే 8, ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్. విశ్రాంత, ప్రస్తుత ఐఏఎస్, ఐపీఎస్‌లు నివసించే ప్రాంతం. ప్రతి అధికారికి పోలీసు సిబ్బంది, కొందరికి సాయుధ పహారా ఇలా అన్ని ఉన్నాయి. శతృదుర్బేధ్యంగా ఉండే ఈ ప్రాంతంలో దోపిడి దొంగలు రెచ్చిపోయి ఒక మాజీ డీజీపీ సతీమణి మృతికి కారణమవ్వడం ఇప్పుడు సంచలనంగా మారింది. జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్‌నగర్‌లో నివసించే మాజీ డీజీపీ వినయ్ రంజన్ రే ఇంట్లో పనిచేసే నేపాలి పనిమనిషి కల్పన మరో ముగ్గురితో కలిసి దోపిడికి పాల్పడటమే కాకుండా దోపిడి సమయంలో మాజీ డీజీపీ సతీమణి తనూజ రంజన్‌ను బంధించడంతో ఆమె మృతిచెందింది. మాజీ డీజీపీకి ఒక పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ (పీఎస్ఓ) విధుల్లో ఉండాలి. కాగా మాజీ డీజీపీ సతీమణి మృతిచెందడంతో ఈ సంఘటన ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకొంది. ఈ నేపథ్యంలోనే సంఘటన గురించి తెలిసిన కొన్ని గంటల్లోనే రాష్ట్ర డీజీపీ, ఇంటిలిజెన్స్ వర్గాలు, నేరవిభాగ వర్గాల ఉన్నతాధికారులు అంతా సంఘటనాస్థలానికి వచ్చారు. పోలీసు ఉన్నతాధికారులు, విశ్రాంత ఉన్నతాధికారులు నివసించే ప్రాంతంలో దోపిడి, హత్య జరగడంతో ఈ వ్యవహారాన్ని పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. ఇందులో భాగంగానే మాజీ డీజీపీ పీఎస్ఓ వ్యవహారంపై సైతం పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. విధుల్లో ఉండాల్సిన పీఎస్ఓ(కానిస్టేబుల్) గురువారం రాత్రి 10 గంటల తరువాత విధుల్లో లేడని ప్రాథమికంగా గుర్తించారు. దీనికితోడు ఇంట్లో మాజీ డీజీపీ సైతం లేని సమయంలో విధుల్లో ఖచ్చితంగా ఉండాల్సిన ఆయన లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. అంతేకాకుండా సంఘటన ముందు రోజు సైతం నిందితులు రెక్కీ నిర్వహించడం, మరుసటి రోజు దర్జాగా దోపిడికి రావడం ఇప్పుడు పోలీసులను కలవరపరుస్తుంది. ఈ క్రమంలోనే సంఘటన జరిగిన సమయంలో నిందితులు ధైర్యంగా ఇంట్లోకి ప్రవేశించారని, హత్యకు కారణమైందని భావిస్తున్నారు. పీఎస్ఓ వ్యవహార శైలిపై పోలీసు ఉన్నతాధికారులు ఇప్పుడు చర్యలు తీసుకొనేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే నివేదికను రూపొందించి అందించాలని ఉన్నతాధికారులు కింది స్థాయి అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలుస్తుంది.

సికింద్రాబాద్ కుల దురహంకార హత్య అత్యంత కిరాతకం

-నిందితులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లి

హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త: కులాంతర వివాహానికి సిద్ధపడ్డారనే నెపంతో సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో బీటెక్ విద్యార్థి యావన్‌ను దుండగులు అత్యంత దారుణంగా, కిరాతకంగా హత్య చేయడాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిందితులను అరెస్టు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. యావన్‌ను పక్కా పథకం ప్రకారం సభ్య సమాజం తలదించుకునే విధంగా వేటకొడవళ్లతో దాడి చేసి చంపడం దారుణమన్నారు. రెండు నెలలుగా రెక్కీ నిర్వహించి, పాత వాహనాలు, సిమ్ కార్డులు సేకరించి ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టడం దుర్మార్గమన్నారు. కులం, మతం పేరుతో జరుగుతున్న కులదురహంకార హత్యలపై సమాజంలో చైతన్యం తేవడానికి, కులాంతర వివాహాల రక్షణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర నడిబొడ్డున ఇలాంటి దాడులు జరగడం శోచనీయమన్నారు. తక్షణమే నిందితులందరినీ వెంటనే అరెస్ట్ చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసుల పేరుతో బెదిరింపులు

- కిడ్నాప్ చేసి రూ. 33.50 లక్షలు వసూలు

- బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 8, ప్రభాతవార్త:

పోలీసుల పేరుతో కిడ్నాప్‌కు పాల్పడి రూ. 33.50 లక్షలు వసూలు చేసిన సంఘటన బంజారాహిల్స్ ఠాణాలో వెలుగుచూసింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. నిఖిల్ అనే యువకుడు మౌనిక అనే యువతితో ఏడాదిపాటు రిలేషన్‌షిప్‌లో ఉన్నాడు. ఇద్దరి మధ్య గొడవల నేపథ్యంలో వేర్వేరుగా ఉంటున్నారు. అనంతరం మౌనిక గచ్చిబౌలి ఠాణాలో నిఖిల్‌పై ఫిర్యాదు చేసింది. సెటిల్‌మెంట్ చేసుకోవడానికి కోటి రూపాయలు డిమాండ్ చేసినట్లు నిఖిల్ ఆరోపణలు చేశాడు. ఇదిలా ఉండగా గత నెల 10న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తమను తాము పోలీసులమని చెప్పి నిఖిల్ స్నేహితుడైన సాయిని బంజారాహిల్స్ రోడ్ నంబరు 13లో కిడ్నాప్ చేసి కుషాయిగూడకు తీసుకెళ్లారు. అక్కడ అతన్ని బెదిరించడంతో నిఖిల్ అనంతపురంలో ఉన్నట్లు చెప్పాడు. దీంతో మరుసటి రోజు అనంతపురం వెళ్లిన వారు నిఖిల్ అతని స్నేహితుడు మహేష్, సాయిలను కిడ్నాప్ చేసి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో ఉన్న ఒక ఫామ్‌హౌజ్‌కు తీసుకొచ్చారు. అక్కడ బెదిరింపులకు పాల్పడటంతో రూ. 50లక్షలు ఇచ్చేందుకు నిఖిల్ అంగీకరించి రూ. 20 లక్షలు చెల్లించాడు. అనంతరం పంజాగుట్టలో బంగారు ఆభరణాలు విక్రయించి కొంత నగదు తన తండ్రి వద్ద తసుకొని మరో రూ. 13.26లక్షలు చెల్లించాడు. అనంతరం పోలీసుల పేరుతో కిడ్నాప్‌కు పాల్పడింది సుధీర్‌బాబు, జాన్, ప్రసాద్‌రెడ్డిలుగా గుర్తించాడు. మౌనిక ఆదేశాలతోనే వీరు ఈ బెదిరింపులకు పాల్పడినట్లు అనుమానిస్తూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సున్నితపదాల్లో అద్భుతాలొలికించిన ఆత్రేయ

: తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు

గానప్రవీణ బిరుదు గ్రహీతలతో నిత్యానందరావు, కొండలరావు, లక్ష్మీనారాయణ, బుజ్జి, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

రవీంద్రభారతి, మే 8 ప్రభాతవార్త :
గేయరచనల్లో దిట్ట అయిన ఆచార్య ఆత్రేయ అతి సున్నిత పదాల్లో అద్భుత భావాలు ఒలికించారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, యువకళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగిన ఆచార్య ఆత్రేయ 105వ జయంతికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిత్యానందరావు గౌరవ అతిథులు పొత్తూరి సుబ్బారావు, డా. పి.రాజేందర్‌కుమార్, డా, పి.జ్యోతి, ఎస్వీ రామారావు, దైవజ్ఞ శర్మ, బొప్పన నరసింహారావు (బుజ్జి), సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తదితరులతో కలిసి ప్రముఖ వర్ధమాన గాయనీ గాయకులు అఖిల, టి.బాలకామేశ్వరరావులను ఘనంగా సత్కరించి గానప్రవీణ బిరుదు ప్రధానంచేసి ప్రసంగించారు. దీక్షతో సినీలోకంలో ప్రవేశించిన ఆత్రేయ సంగీత ప్రపంచానికి తనదైన ప్రత్యేకశైలిలో లాలిత్యాన్ని, మాధుర్యాన్ని అందించారన్నారు. సభకు ముందు నాపాట నీనోట పలకాలచిలకా సినీగీతాల విభావరి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుని మైమరపించింది.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నిజాంపేట్, మే 8, ప్రభాతవార్త
చెట్ల కొట్టివేత, విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ బాచుపల్లి అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. శశిధర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 11 కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, మా విల్లాస్, ఎస్ఎల్జీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. ఈ సమయంలో హిల్ కౌంటీ రోడ్, కాకతీయ నగర్, ఇందిరా నగర్, బాచుపల్లి గ్రామం, ఎస్సీ కాలనీ, సీతారామ హోమ్స్, మా విల్లాస్, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా, ప్రణీత్ అంటిల్లా రోడ్, కౌసల్య కాలనీ ప్రాంతాలు ప్రభావితమవుతాయని తెలిపారు. అలాగే ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు 11 కేవీ కోకాకోలా, అపర్ణ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమయంలో కోకాకోలా ఇండస్ట్రియల్ ఏరియా, అపర్ణ, సాయి అనురాగ్ కాలనీ, కౌసల్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు కోరారు.

సికింద్రాబాద్ జోన్ పరిధిలో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహణ

సికింద్రాబాద్, మే 8 ప్రభావార్త:
హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ జోన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ధూమపానం చేసే వారిపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 38 పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు.. ఈ బృందాలు జోన్ పరిధిలోని జీహెచ్ఎంసీ పార్కులు, స్మశాన వాటికలు, వైన్ షాపులు, జనావాసాలు లేని ప్రాంతాలతో పాటు ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్ వివరాలు: ఒకరు గంజాయి సేవిస్తున్న వ్యక్తిని, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న 28 మందిని గుర్తించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 81 మందిపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారందరిపై కేసులు నమోదు చేశారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రజలకు అసౌకర్యం, ఇబ్బంది కలిగించే ఇటువంటి పనులను పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో బహిరంగ మద్యపానం, ధూమపానం. గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని డీసీపీ తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనసన్మానం

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న వాకిటి శ్రీహరి, మొగుళ్ళ రాజిరెడ్డి, బొంతు రామ్మోహన్, చల్లా నరసింహారెడ్డి తదితరులు

హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త
రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, ఐఎన్‌టియుసి నాయకులు ఘనంగా సన్మానించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్, ఐ.ఎన్.టి.యు.సి నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి వాకిటి శ్రీహరితో కలసి ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి, డిసిసి అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు శాలువా, పుష్పగుచ్చం అందించి మంత్రిని ఘనంగా సన్మానించారు.

రాజ్యాంగబద్ధమైన వాటా కోసం బిసిలు ఉద్యమించాలి : బాలగౌని బాలరాజ్‌గౌడ్

బీసీ పొలిటికల్ ఫ్రంట్ సమావేశంలో మాట్లాడుతున్న ఫ్రంట్ చైర్మన్ బాలరాజ్ గౌడ్, చిత్రంలో అయిలి వెంకన్నగౌడ్ తదితరులు

హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త
రాజ్యాంగబద్ధమైన వాటా కోసం బీసీలు ఉద్యమించాలని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. ఓబీసీ వర్గానికి చెందిన ప్రధాన మంత్రి ఓబీసీల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. శుక్రవారం పొలిటికల్ ఫ్రంట్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్‌తో కలిసి మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి 9వ షెడ్యూల్లో చేర్చి అమలు చేయాలని, జనగణనలో కులగణను లెక్కించాలని, బీసీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీ రక్షణచట్టాన్ని తీసుకురావాలని, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ను పునర్ సమీక్షించాలని, రోహిణి కమీషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ కులాల వారీగా బీసీ కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించిన ప్రభుత్వం ఆ కార్పొరేషన్లకు అవసరమైన అధికారాలు, నిధులు, స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వలేదని ప్రశ్నించారు. చైర్మన్ పదవులను కేవలం పేరుకే పరిమితం చేసి జీతాలు కుర్చీలు వైస్ చైర్మన్ హోదాకు పరిమితం చేయడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ బైరు శేఖర్, పోతగాని ఐలన్ గౌడ్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలి : శ్రీనివాస్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సైఫాబాద్, మే 8 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలైనా బిసిల పరిస్థితి మారలేదని, ప్రత్యేక తెలంగాణ వచ్చిన తరువాత కూడా బిసిలకు న్యాయం జరగకపోవడం అన్యాయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ వచ్చిన తరువాత కూడా బిసిలకు న్యాయం జరగకపోవడం బాధకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థుల కోసం పోరాడి సాధించుకున్న ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని నేడు నిబంధనల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బిసి విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం వస్తే మేజార్టి ప్రజలకు రాజ్యాధికారం లభిస్తుందని, ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయం తెలంగాణ రాష్ట్రంలో జరగదని భావించిన వందలాది మంది విద్యార్థులు, యువజనులు బలిదానాలు చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది బడుగు విద్యార్థుల చదువులకు భరోసా నింపిన ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని నేడు తెలంగాణ రాష్ట్రంలో అగ్రకుల ప్రభుత్వాలు జివొ నెంబరు 7ను విడుదల చేసి ఈ పథకానికి ఉరి తీసిందని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకుండా పేద విద్యార్థుల పీకలు పిసుకుతున్నదని దుయ్యబట్టారు. ప్రక్క రాష్ట్రంలో బిసి సబ్‌ప్లాన్, ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం యధావిధిగా అమలు జరుగుతుంటే ఇక్కడ బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోధ వరుణ్‌కుమార్‌ను నియమించారు. ఈ సదస్సులో బిసి నాయకులు కుందారం గణేషాచారి, శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బిసి'ఎ'లోకి మార్చాలని సిఎంకు వినతి

- త్వరలోనే తీపి కబురు వింటారని హామీనిచ్చిన సిఎం

సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రంను అందజేస్తున్న ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మంత్రి శ్రీహరిలు.

నార్సింగి, మే 8 ప్రభాతవార్త : విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో వెనుకబడిన ముదిరాజ్ సామాజిక వర్గంను బిసి'డి' నుంచి బిసి'ఎ'లోకి మార్చాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మంత్రి శ్రీహరిలు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఇఇపిసి-2026 నివేదికలో ముదిరాజ్ సమాజం సామాజిక, విద్యా, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉందని స్పష్టంగా వివరించారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసి ముదిరాజ్ సమాజానికి తక్షణమే న్యాయం చేయాలని సీఎంను కోరినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా పరంగా అగ్రస్థానంలో ఉన్న ముదిరాజ్‌లు విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక రంగాలలో వెనుబడి ఉన్నారని, వీరిని ఇతర సామాజిక వర్గాలతో సమానం చేయాలంటే బిసి'ఎ'లో చేర్చడం ఒక్కటే మార్గమని సీఎంకు వినతిపత్రంలో విన్నవించామన్నారు. వినతిపత్రం చదివిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే తీపి కరుబు వింటారని పేర్కొన్నారని ముదిరాజ్ సామాజికవర్గ పెద్దలు తెలిపారు. ఈ అంశంను త్వరితగతిన చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారని వివరించారు. సీఎం సానుకూల స్పందన పట్ల ముదిరాజ్ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ముదిరాజ్ సమాజాభివృద్ధికి, యువత భవిష్యత్తుకు, సముచిత అవకాశాలకు బిసి'ఎ' ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. సీఎంకు వినతిపత్రం ఇచ్చిన వారిలో ముదిరాజ్ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ ముదిరాజ్, సీనియర్ నేత బి.వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా సాగిన శృంగార రథోత్సవం

శృంగార రథోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు శృంగార రథోత్సవంపై అధిరోహించారు. పాంచరాత్రాగ శాస్త్రోక్తంగా ఉత్సవాలను ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ వి.అంబుజ ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, మహానివేదన, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పతాధివాసము, హవనము, భేరిపూజ, దేవతా హ్వానము, హవనము, బలిహరణము కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వెలపల సాంస్కృతిక కార్యక్రమాలు, లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు. కాగా బుధవారం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుంది. సోమవారం ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది.

నేడు పూర్ణాహుతి, చక్రతీర్థము

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుందని ఈవో అన్నపూర్ణ వివరించారు. 20న ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం అరు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలుంటాయి.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా శివరాత్రి బిక్షంను నియమించాలి

ప్రసంగిస్తున్న తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు చైర్మన్ శివరాత్రి అయిలమల్లు

చిక్కడపల్లి మే 8 (ప్రభాతవార్త) :
వడ్డెర కులస్తుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవికి, గత 15 ఏళ్లగా కుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న శివరాత్రి బిక్షంను నియమించాలని తెలంగాణ వడ్డెర సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు, చైర్మన్ శివరాత్రి అయిలమల్లు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శివరాత్రి అయిలమల్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని, అయితే చైర్మన్ నియామకంలో తీసుకున్న నిర్ణయం పునరాలోచించుకోవాలని కోరారు. 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మరియు 604 మండలాల ప్రతినిధులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపిన శివరాత్రి బిక్షంను కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఎవరికీ పరిచయం లేని గుంజ రేణుక నారాయణను ప్రకటించడం సరికాదన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కోశాధికారి గుర్రం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మంజల నగేష్, రాష్ట్ర కార్యదర్శులు వల్లపు శంకర్ రాజు, సంపంగి కృష్ణ, ప్రచార కార్యదర్శి గిరిశెట్టి రాజు పాల్గొన్నారు.

మోడీ బహిరంగ సభను విజయవంతం చేయండి

చిక్కడపల్లి మే 8 (ప్రభాతవార్త) : ఈ నెల 10వ తేదీ ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ కోరారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, బాపు నగర్, వివేక్ నగర్, కాపువాడ, పద్మివాడ బస్తీలతో పాటు పీపుల్స్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు, మేధావులు, ఉన్నత విద్యావంతులు, యువత భారీ సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, సత్తి రెడ్డి, శ్రీనివాస్, సత్యేంధర్, లక్ష్మి మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ కార్పొరేట్ కుట్ర

నిరసన తెలువుతున్న నేతలు

కంటోన్మెంట్, మే 8 ప్రభాతవార్త:
భారత రైల్వే బోర్డు ఏప్రిల్ 26న ప్రకటించిన మానవశక్తి హేతుబద్ధీకరణ మ్యాన్ పవర్ రేషనలైజేషన్ 2026-27 పేరుతో 2 పోస్టుల తగ్గింపు (సుమారు 29,608 పోస్టులు) నిర్ణయం సాధారణ పరిపాలనా చర్య కాదని, ఇది దేశ యువతపై నేరుగా చేసిన దాడి అని , ప్రజా రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తీవ్రంగా ఆరోపిస్తోంది. రైల్వే బోర్డ్, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని రైల్ నిలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు, అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కు ఏఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కోశాధికారి పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, సల్మాన్ బేగ్, ఎల్లంకి మహేష్, శేఖర్, మధుకర్, రాజ్ కుమార్, మెస్రం భాస్కర్, ఆంజనేయులు, చారి, అజీమ్, భరత్, అలీ, కిరణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర బిజెపి చీఫ్ రామచందర్ రావు

పోస్టర్‌ను విడుదల చేసిన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్

చార్మినార్,మే 8 ప్రభాతవార్త :
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించిన ఉర్దూ పోస్టర్‌ను శుక్రవారం రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.

వడ్డెరల సమస్యలను ప్రధానికి వివరిస్తాం

-అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం

ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న వేముల లక్ష్మణ్, మైశయ్య, లోకేష్, మాధవి,రాజమ్మ తదితరులు

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త:
రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని నరేంద్రమోదీకి వివరిస్తామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్షణ్ తెలిపారు. దేశ వ్యాప్యతంగా వడ్డెర కులస్తుల సమస్యలను ప్రధాని మోదీకి వివరించేందుకు అవకాశం కల్పించాల్సిందిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావుకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు దండుగుల మైశయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన జనగణనలో తమ కులం జనాభా సంఖ్యను తక్కువగా చూయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్ల పోరాట ఫలితంగా బీసీఏలో ఉన్న తమ కులాన్ని ప్రభుత్వం (డీ నోటిఫైడ్ ట్రైబ్స్) డీఎన్టీలో చేర్చడం హర్షించదగిన విశయమన్నారు. ప్రభుత్వాలు తమ కులాన్ని డీఎన్టీలో చేరిస్తే సరిపోదని, వడ్డెరుల అభివృద్ధికి వేయ్యి కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. సంఘం అద్వర్యంలో ఏళ్లుగా పోరాటం చేస్తుంటే కొందరు తమ సంఘం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కులాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తే సంక్షేమ సంఘం చూస్తూ ఊరుకోదని, అవినీతి నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బోదాస్ మాధవి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డా. లోకేష్ వేముల, ప్రధాన కార్యదర్శి మక్కల శేఖర్, ఆలకొండ రాజమ్మ వెంకటేష్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథా కళా వైభవం భావితరాలకు అందించడం మన బాధ్యత

-సిబిఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ

బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న సిబిఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ , చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు

చిక్కడపల్లి మే 8 (ప్రభాతవార్త) : తెలుగు నేల గర్వించదగ్గ జానపద కళారూపాలలో బుర్రకథ అత్యంత విశిష్టమైనదని, ఇలాంటి కళలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని సిబిఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహంలో చౌక్ లింగం బృందం చే భక్త మార్కండేయ బుర్రకథను అద్భుతంగా చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ నాగమారుతి శర్మ ప్రసంగించారు. స్వతంత్ర ఉద్యమ కాలం నుండి సమాజంలో చైతన్యం నింపడంలో బుర్రకథ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. నేటి ఆధునిక కాలంలో ఇతర వినోద సాధనాలు పెరిగినప్పటికీ, బుర్రకథా కళాకారులు తమ ప్రాణప్రదంగా ఈ విద్యను కాపాడుకుంటూ రావడం అభినందనీయమన్నారు. జానపద కళాకారులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలని, అప్పుడే భావి తరాలకు మన సంస్కృతి అందుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాహితికిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, గానసభ గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాల అందజేత

ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలు అందజేస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్, మే 8 ప్రభాతవార్త:
సీనియర్ బీఆర్ఎస్ కంటోన్మెంట్ నాయకుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను అందజేశారు. కంటోన్మెంట్ వార్డు 1కి చెందిన అబ్దుల్ లతీఫ్ జాహిద్‌కు వైద్యం కోసం రూ.1లక్షా 50వేలు మంజూరయ్యాయి. ఇందకు సంబంధించిన పత్రాలను అందజేశారు.

రేషన్ షాపుల్లో మే, జూన్ నెలల గోధుమల పంపిణీ

కంటోన్మెంట్, మే 8 ప్రభాతవార్త:
సికింద్రాబాద్ 9వ సర్కిల్ సివిల్ సప్లై పరిధిలో ఉన్న తెల్ల రేషన్ కార్డు హోల్డర్లకు మే, జూన్ 2 నెలలకు సంబంధించిన గోధుమలు పంపిణీ చేస్తున్నామని అసిస్టెంట్ సివిల్ ఆఫీసర్ చాముండేశ్వరి తెలిపారు శుక్రవారం రెజిమెంటల్ బజార్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైట్ రేషన్ కార్డు హోల్డర్లు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆమె తెలిపారు. లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ నిత్యవసర సరుకులు నిలిపివేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు అరుణ అభిషేక్ తివారి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అద్భుతమైన గాయని ప్రసన్న విజయ్ కుమార్

ప్రసన్న విజయ్ కుమార్‌కు స్వరకోకిల పురస్కారం ప్రధానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి మే 8 (ప్రభాతవార్త) :
అద్భుతమైన గాయని ప్రసన్న విజయ్ కుమార్ అని వక్తలు అన్నారు. శుక్రవారం ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇసాన్ ఫౌండేషన్, విజయ్ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ గాయని స్వర్గీయ పి.వి. సుజాత మూర్తి స్మారకార్థం జరిగిన కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయని ప్రసన్న విజయ్ కుమార్‌కు ఖిస్వరకోకిలఖి పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మిల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో జంట నగరాలకు చెందిన ప్రముఖ గాయనీ గాయకులు 90కి పైగా మధురమైన సినీ గీతాలను ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా పి.వి. సుజాత మూర్తి పేరిట ఏర్పాటు చేసిన తొలి ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రముఖ గాయని ప్రసన్న విజయ్ కుమార్ కు ప్రదానం చేశారు. సుమారు 150కి పైగా ప్రైవేట్ ఆల్బమ్స్‌లో తన మధుర గానంతో అలరించిన ఆమెకు ఖిస్వర కోకిలఖి బిరుదుతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి మాట్లాడుతూ 2022 నుండి 2026 వరకు తమ సంస్థ నిర్వహించిన 90కి పైగా కార్యక్రమాల్లో పాల్గొని ఆదర్శంగా నిలిచినందుకే ప్రసన్న విజయ్ కుమార్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా ప్రతిభావంతులైన గాయనీ గాయకులను ఇలాగే ప్రోత్సహిస్తామని వారు పేర్కొన్నారు. గాయని గాయకులూ పివి.రమణమూర్తి, భవాని రవి కుమార్ , ప్రసన్న, సౌమ్య, సవితశ్రీ తదితరులు అద్భుతంగా గానం చేసారు.

జనగణనలో పాల్గొన్న డిజిపి, హైడ్రా కమిషనర్

జనగణన పోస్టర్లను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి చూపుతున్న డీజీపీ సీవీ ఆనంద్

జూబ్లీహిల్స్, మే 8, ప్రభాతవార్త:
రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని తన నివాసంలో శుక్రవారం సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో పాల్గొన్నారు. నగరంలోని ప్రతి ఒక్కరూ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సులభమైన జనగణనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసి ఎన్. శంకర్, ఏఎంసీ కైలాస్‌చాంద్, టెక్నికల్ పర్సన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సైతం శుక్రవారం జనగణన పూర్తిచేశారు. ఇప్పటికే ఎస్ఐఆర్ సైతం పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం సర్కిల్ 38 పరిధిలో స్వచ్ఛభారత్, సానిటేషన్ తదితర అంశాలపై డీఎంసీ సురేష్‌కుమార్‌తో చర్చించారు.

బహుజన హితాయ బహుజన సుఖాయ ఆకాశవాణి నినాదం

ఆకాశవాణి వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఎన్.వి.రమణ, హరిసింగ్ తదితర ఆకాశవాణి హైదరాబాద్ సిబ్బంది

నాంపల్లి, మే 8 ప్రభాతవార్త :
బహుజన హితాయ, బహుజన సుఖాయ నినాదంతో అందరి శ్రేయస్సు, అభివృద్ధి ధ్యేయంగా ఆకాశవాణి తమ ప్రసారాలు అందిస్తుందన్న ఆకాశవాణి తెలంగాణ క్లస్టర్ డిడిజి(ఈ) హరిసింగ్, ఆకాశవాణి ప్రసారాలు మొదలై 90 వసంతరాలు పూర్తి చేసుకుంటున్న శుభసందర్భంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6.30గంటల నుండి నిర్వహించిన విజయవంతమైందన్నారు. ఆకాశవాణి సిగ్నేచర్ ట్యూన్, వందేమాతరం, మంగళధ్వనితో ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంగణంలో ప్రారంభమైన ఈ వాకథాన్‌లో ఆకాశవాణి, దూరదర్శన్ సిబ్బందితోపాటు ప్రాంతీయ వార్తవిభాగ సిబ్బంది, కాజువల్ అనౌసర్లు, ఆర్‌జెలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భానోతు హరిసింగ్, ఎన్.వి.రమణలు ఆకాశవాణి ఎట్‌దరేట్90 వాకథాన్‌ను ఫ్లాగ్‌ఆఫ్‌చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ వాకథాన్ బషీర్‌బాగ్, సచివాలయం మీదుగా సాగి తిరిగి ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంగణంలో దిగ్విజయంగా ముగిసింది. ఆకాశవాణి ప్రధాని నరేంద్ర మోదీ మనసులో మాట గత 132 నెలలుగా హిందీతోపాటు దేశంలోని అన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారంచేస్తూ ప్రజలకు మరింత చేరువైందన్నారు. హైదరాబాద్ దూరదర్శన్ కేంద్ర సంచాలకుడు, డిడిజి(ఈ) ఎన్.వి.రమణ మాట్లాడుతూ ఆకాశవాణి కార్యక్రమాలు అనాదికాలం నుండి వస్తున్న ప్రాచీన భారతీయ సంస్కృతి, కళలు, కళారూపాలను, సాహిత్యాన్ని పరిరక్షిస్తూనే నిత్యనూతన రూపకల్పనలతో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, ఆకాశవాణి ప్రసారాలు ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని నిరంతరం అందించే సమాచార ఘని అని కొనియాడారు.

మీ ప్రాంతాల్లో మైనింగ్ జరుగుతోందా..?

-క్రషర్లతో పాటు ఆర్ ఎంసీ ప్లాంట్లు నడుస్తున్నాయా..?

-9000113667కు సమాచారమివ్వాలని కోరిన హైడ్రా

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త:
మీ ప్రాంతాల్లో మైనింగ్ జరుగుతోందా..? కొండలను పిండి చేస్తున్న క్రషర్లు పని చేస్తున్నాయా..? ఆర్ ఎం సీ(రెడీ మిక్స్ కాంక్రీట్) ప్లాంట్లు దుమ్ము రేపుతున్నాయా..? పర్యావరణానికి ఇవన్నీ తూట్లు పొడుస్తున్నాయా..? అయితే ఆ సమాచారం హైడ్రా 9000113667కు అందజేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో నగర ప్రజలను కోరారు. ఓఆర్ఆర్ కు లోపల, బయట 1 కిలోమీటరు పరిధిలో ఆర్ఎంసి, క్రషర్లు పని చేస్తున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కరెంటు లొకేషన్‌తో పాటు..అక్కడి ఫొటోలు వాట్సాప్‌లో షేర్ చేసి సమాచారం ఇస్తే.. వాటి అనుమతులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

-జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



అత్తాపూర్ మే8,ప్రభాతవార్త : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పిరంచెరువు ప్రాంతాన్ని డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, ఎస్ఈ నరేందర్ గౌడ్ , డీఈఈ యాదయ్య , యూబీడీ మేనేజర్ వెంకటేష్ ,డీఈ ఎస్‌డబ్ల్యూఎం అభిషేక్‌లతో కలిసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి రోడ్ల పరిస్థితి, డ్యామేజీలు మరియు స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా 99 రోజు ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతంగా మరియు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఇళ్ల సముదాయంలో అవసరమైన డ్రైనేజ్ సిస్టమ్ మరియు రోడ్డు సదుపాయాల కోసం సంబంధిత అధికారులు సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని ఎస్ఈ, ఏఈ , డీఈఈలకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగపర్చేందుకు చర్యలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట,మే 8 ప్రభతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి రూపాయలకు వ్యయంతో రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ పాఠశాల అధునీకరణకు నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మహావీర్ ఇంటర్నెషనల్ ఉడాన్ ట్రస్ట్‌ను ఒప్పించి కార్పోరేట్ పాఠశాలలో తరహాలో సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్,పాండు రంగ స్వామి ఆలయ చైర్మన్ అల్లాడి గౌరి శంకర్, సీనియర్ కాంగ్రెస్ నేతలు సి.సంతోష్ యాదవ్,చిర్రబోయిన వైష్ణవి యాదవ్,బద్రి యాదవ్, నందికంటి రవి, నాగేశ్ యాదవ్, బాబు రావు ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూసిటీ వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా పూజలు

1వ వార్డు న్యూ సిటీ కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా పూజలు

కంటోన్మెంట్,మే 8 ప్రభతవార్త: కంటోన్మెంట్ బోయిన్‌పల్లి న్యూ సిటీ కాలనీలో ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రతి నెల శ్రావణ నక్షత్ర రోజును పురస్కరించుకొని శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమంత్ రెడ్డి,జగన్ మోహన్,రాంమోహన్ రావ్,సాంబశివరావ్,నాగేశ్వర్ రావ్,అర్చకులు పవన్,శ్రీధర్, దీపక్‌లు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన మహాప్రసాదన భక్తులకు అందజేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు అభినందనీయం : కోట నీలిమ

సిటీలైట్ చౌరస్తాలో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోట నీలిమ.

బేగంపేట మే 8,ప్రభాతవార్త

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పీసీసీ ఉపాధ్యక్షురాలు,సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట నీలిమ అన్నారు.రాంగోపాల్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు త్రికాల మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో సిటీలైట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం కోట నీలిమ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో బాట సారులు,ఆటో డ్రైవర్లు ,హమాలీలు,ఇతర వాహనాల డ్రైవర్లకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.నిత్యం ఈ ప్రాంతంలో ఉన్న వివిధ షాపులలో పనిచేసేవారు,కొనుగోలు చేసేందుకు వచ్చే వారికి కూడా చలివేంద్రం ఎంత గానో ఉపయోగపడుతుందన్నారు.తాగునీటి సౌకర్యం కల్పించడం అంటే సమాజం పట్ల మనకు ఉన్న బాధ్యతను తెలియజేస్తుందన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రమైన నీటిని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతుగా వేసవి కాలంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలిని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో శీలం జయ,రఘు ముదిరాజ్,పెరుమల చందు, దుర్గయ్య,జైకృష్ణ,ఎల్లేష్,యాసిన్,శ్రీకాంత్‌చారి,హేమంత్‌సింగ్,సత్య,ఎస్సార్ శివకుమార్,బలవన్,లాలా,రఘు యాదవ్,పాల్గొన్నారు.

12న టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు రెమిడియల్ క్యాంప్‌లు ప్రారంభం

చాంద్రాయణగుట్ట, మే 8, ప్రభాతవార్త : హైదరాబాద్ జిల్లా పరిధిలో పదవ తరగతి అనుత్తీర్ణులైన (ఫెయిల్) విద్యార్థుల కోసం ఈనెల 12వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు రిమిడియల్ క్యాంప్‌లు (పరిహార శిబిరాలు) నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఇందు కోసం జిల్లాలోని 12 జోన్లలో 12 పాఠశాలను ఎంపిక చేశారు. బహదూర్‌పురా జోన్‌లో కాలికమాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బండ్లగూడ జోన్‌లో చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చార్మినార్ జోన్‌లో చాదర్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎస్‌సిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారు. వారిలోని అభ్యసన లోపాలను సవరిస్తారు. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు అన్ని విధాలుగా సన్నద్ధం చేస్తారు. ఆ జోన్ పరిధిలోని ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి ఫెయిలైన పదవ తరగతి విద్యార్థులు ప్రత్యేక శిబిరాలకు వంద శాతం హాజరయ్యేలా స్థానిక ఉప విద్యాశాఖ అధికారులు (డిప్యూటీ ఈఓలు) చర్యలు చేపడతారు.

దుర్గమ్మ దేవి ఉత్సవాల్లో పాల్గొన్న రాకేష్

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాకేష్

జీడిమెట్ల, మే 8, ప్రభాతవార్త

మేడ్చల్‌గిర్మాపూర్ గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ దుర్గమ్మ దేవి ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో ప్రముఖ యువ నాయకుడు జాలిగం రాకేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద పండుగ కమిటీ ఆహ్వానం మేరకు వేడుకలకు హాజరైన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా జాలిగం రాకేష్ మాట్లాడుతూ గ్రామ దేవత ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామ ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య నిర్వహిస్తున్న ఈ వేడుకలు సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు పొందుతూ గ్రామ ప్రజల సుఖశాంతులు కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బొక్క ధర్మరెడ్డి, బొక్క రఘురాం రెడ్డి, బొక్క కిషన్ రెడ్డి, బొక్క శ్రీనివాస్ రెడ్డి, బొక్క రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

పిల్లల్లో నైపుణ్యాభివృద్ధికి వేసవి శిబిరాలు దోహదం : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని

సంజీవరెడ్డి నగర్, మే 8, ప్రభాతవార్త: వేసవి శిబిరాలు పిల్లల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సనత్ నగర్‌లోని ఈలైబ్రరీలో సంకేత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్యాంప్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంకేత్ సంస్థ గత 12 సంవత్సరాలుగా అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని ప్రశంసించారు. 23 రోజుల పాటు నిర్వహించే ఈ ఫ్రీ సమ్మర్ క్యాంప్‌లో 3 నుండి 15 సంవత్సరాల లోపు పిల్లలకు పెయింటింగ్, అబాకస్, ఇంగ్లీష్, పజిల్స్ తదితర విభాగాల్లో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు.తల్లిదండ్రులు పిల్లల వేసవి సెలవులను వృథా చేయకుండా ఇలాంటి శిబిరాలలో చేర్పించి వారి ప్రతిభను వెలికితీయాలని సూచించారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసం కొనసాగేందుకు ఆర్థిక సహాయం అందించడం కూడా గొప్ప సేవ అని కొనియాడారు. సంకేత్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అన్నీ ఆర్థిక భారం ఉన్నప్పటికీ సేవా దృక్పథంతో కొనసాగుతున్నాయని అన్నారు.సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు తన సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంస్థ కార్యకలాపాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కార్యాలయ నిర్వహణ కోసం స్థలం కేటాయించిన విషయాన్ని కూడా గుర్తు చేశారు.అనంతరం చిన్నారులు రూపొందించిన వివిధ పెయింటింగ్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో సనత్ నగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, సంకేత్ సంస్థ అధ్యక్షురాలు మమత, ఫౌండర్ మురళి, నాయకులు సురేష్ గౌడ్, రమేష్ గౌడ్, గోపి, కరుణాకర్ రెడ్డి, రాజేష్ ముదిరాజ్, ఖలీల్, పీయూష్ గుప్తా, అర్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పోరేషన్‌కు అన్ని విధాల అర్హుడైన వ్యక్తి శివరాత్రి బిక్షంను నియమించాలి

సమావేశంలో మాట్లాడుతున్న శివరాత్రి అయిలిమల్లు

సైఫాబాద్, మే 8 ప్రభాతవార్త: వడ్డెర కార్పోరేషన్ ఛైర్మన్ పదవికి నిజమైన అర్హులను నియమించాలని తెలంగాణ వడ్డెర సంఘం, ఛారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ పదవికి అన్ని విధాల అర్హుడంటే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు శివరాత్రి బిక్షం అని సంఘం నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలి మల్లు, కోశాధికారి గుర్రం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మంజుల నాగేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది వడ్డెర కులస్తులు ఉన్నారని, వారి స్థితిగతులు, కష్టాలు, నష్టాలు, అభివృద్ధి, వృత్తి తెలియని వ్యక్తి గుంజ రేణుకను ప్రభుత్వం వడ్డెర కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమించడం సమంజసం కాదన్నారు. వడ్డెర జాతి గురించి, కార్పోరేషన్ కోసం ఎంతో కృషి చేసిన నాయకులను కాదని ప్రభుత్వం ఆమెను నియమించడం సరికాదన్నారు. 48 గంటల్లోగా ప్రభుత్వం కార్పోరేషన్‌కు నూతన ఛైర్మన్ గా శివరాత్రి బిక్షంను నియమించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది వడ్డెరులు గ్రామ, మండల, ఆర్‌డిఓ, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాలలో ధర్నాలు, నిరాహాదీక్షలు చేపడతారని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా, వడ్డెర కార్పోరేషన్ ఏర్పాటుకు, వడ్డెర జాతి కోసం విశేషంగా గత 15 సంవత్సరాలుగా శివరాత్రి బిక్షం కృషి చేస్తున్నారని వారు వివమించారు.

ఎంబిఎన్ఆర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు

- బుసకొట్టిన నాగుపాము

ఎంబిఎన్ఆర్ చౌరస్తాలో వాహన తనిఖీలను పర్యవేక్షిస్తున్న డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ సుధాకర్‌లు

చాంద్రాయణగుట్ట, మే 8, ప్రభాతవార్త : రాజేంద్రనగర్ జోన్ చాంద్రాయణగుట్ట డివిజన్ పరిధిలోని మహబూబ్ నగర్ చౌరస్తా (ఎంబిఆన్ఆర్)లో గురువారం రాత్రి పోలీసులు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. జోన్ డిసిపి ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షణలో డివిజన్ ఏసీపీ ఎ.సుధాకర్ ఆధ్వర్యంలో నాలుగు పోలీసుస్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు తనిఖీలు కొనసాగించారు. పలువురు అనుమానితులకు ప్రెస్సింగ్ చేశారు. సరియైన వాహన పత్రాలు లేని వాహనదారులకు, మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మొత్తం వంద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. శాంతిభద్రల పరిరక్షణకు చేపట్టే తనిఖీలకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. కాగా వాహన తనిఖీల సమయంలో ఒక ద్విచక్ర వాహనం నుండి నాగు పాము బుసలు కొట్టింది. దీంతో తనిఖీ అధికారులు ఒక్కసారిగా హడలి పోయారు. వెంటనే పాములు పట్టే వారికి సమాచారం అందించారు. అనంతరం ఆ పామును జూ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీలలో చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జె.బాలరాజు, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

చెత్త, మట్టి కుప్పలను తొలగిస్తున్న దృశ్యం

కెపిహెచ్‌బి కాలనీ, మే 8, ప్రభాతవార్త

అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గతంలో పాదయాత్ర చేసినప్పుడు రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త మట్టి కుప్పలను తొలగించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని జి.ఎచ్.ఎం.సి అధికారులను ఆదేశించారు. అదే విషయన్ని శేరిలింగం పల్లి శాసనసభ్యులు, పి.ఏ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, అధికారులతో మాట్లాడి పీజేఆర్ నగర్ కాలనీలో ఉన్న చెత్త మట్టిని యుద్ధ ప్రాతిపదికన తొలగించడం జరుగుతుందని వెంకటేష్ గౌడ్ తెలియ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా అన్ని కాలనీలలోని రోడ్లపై ఉన్న చెత్త మట్టిని తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని, చెత్తను నాలాలలో గాని, రోడ్లమీద గాని, చెరువులలో గాని వేయవొద్దని ప్రజలకు తెలియ చేసారు. జి.ఎచ్.ఎం.సి సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్, ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, ఎస్.ఎఫ్.ఎ మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిపి సివి ఆనంద్‌కు అభినందనల వెల్లువ



ఆనంద్‌ను సత్కరిస్తున్న సత్యనారాయణ

కెపిహెచ్‌బి కాలనీ, మే 8, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర డిజిపి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌ను జాతీయ బీసీ వెల్ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులు డి.వి.వి.సత్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అంకితభావం, నిజాయితీ, నాయకత్వంతో ఈ కొత్త బాధ్యతలో శక్తి, బలం విజయం కలగాలని ఆకాంక్షిస్తున్నామనీ సత్యనారాయణ తెలియజేశారు.

ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన తహసీల్ధార్

తుకారాంగేట్ చౌరస్తాలో ఎస్.ఐ.ఆర్.సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ అసదుల్లాఖాన్

అడ్డగుట్ట,మే 8 ప్రభతవార్త: ఎన్నికల కమీషన్ చేపట్టిన ఓటర్ జాబితా,ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్.ఐ.ఆర్. హెల్ప్‌డెస్క్‌ను శుక్రవారం తుకారాంగేట్ చౌరస్తాలో నిర్వహించిన కేంద్రాన్ని మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్,జిహెచ్ఎంసీ అధికారులు రాజేందర్, సతీష్,అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు గంట రాజు సాగర్‌లు పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి : మాజీ కార్పోరేటర్

కృష్ణనగర్ కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పోరేటర్ చీరె.

బేగంపేట మే 8,ప్రభాతవార్త

రామ్ గోపాల్ పేట డివిజన్ కృష్ణనగర్ కాలనీలో ప్రారంభించిన రోడ్డు పని,వాటర్ లీకేజీ పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని,ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రామ్ గోపాల్‌పేట మాజీ కార్పొరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ అధికారులను కోరారు.శుక్రవారం ఆమె డివిజన్ పరిధిలోని కృష్ణనగర్ కాలనీలో పర్యటించారు. స్థానికులతో చర్చించారు.వారికి ఎదురవుతున్న ఇబ్బందులను వెంటనే వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రావణి,జీహెచ్ఎంసీ ఏఈ శేఖర్‌ల దృష్టికి తీసికెళ్లారు.వీలైనంత వేగంగా పనులను పూర్తి చేసి ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ వెంట బీజేపీ సీనియర్ నాయకులు చీరె శ్రీకాంత్, కాలనీ అధ్యక్షులు ప్రవీణ్,రాజేందర్,డా.అజయ్,శ్రీనివాస్,గౌతమ్,శ్రీనివాస్, వాసు,బీజేపీ నాయకులు మదన్‌పులి, హెచ్.శ్రీనివాస్, శ్రీధర్,మహేష్ తదితరులు ఉన్నారు.

అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఇండక్షన్ స్టావ్‌లు పంపిణీ

అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో స్టావ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

చార్మినార్,మే 8 ప్రభాతవార్త : రాఘవ రత్న టవర్స్‌లో శుక్రవారం అశోక్‌నగర్ అగర్వాల్ సమాజ్ శాఖ అధ్యక్షులు సంజయ్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో యాభై మంది అగర్వాల్ కుటుంబాలకు ఇండక్షన్ స్టావ్‌లు పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రాఫిక్ డిసిపి రాహుల్ హేగ్డే ఇండక్షన్ స్టావ్‌లు అందజేశారు.ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు నరేంద్ర కుమార్ గోయల్,రమేష్ అగర్వాల్,దీపక్ గుప్తా,జయప్రకాష్ అగర్వాల్,అశోక్‌నగర్ శాఖ అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు సంజయ్ కుమార్ అగర్వాల్,పూజ గుప్తా,యువ అగర్వాల్,శ్వేత,తృప్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయం, HQ, STSQM, CMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
నిట్ నం. 08/SE(STSQM)/HQ/CMC/2026-27 (తిరిగి పిలుపు) తేది: 08.05.2026
నిట్ నం.లు: 08(1) & (2)/SE(STSQM)/HQ/CMC/2026 (4వ పిలుపు), (2వ పిలుపు) పని యొక్క కేటగిరీ: 1) నీటి తూటికాడ తొలగింపు 2) మెకానికల్ స్వీపింగ్ సర్వీసుల ఏర్పాటు. అంచనా మొత్తం (రూ.లక్షలలో) : 62.60, 26.00, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ/సమయం: 1) 09.05.2026 ఉ.11.30 గం. 16.05.2026 ఉ.11.30 గం. 2వ పనికి కూడా పై తేదీలు, సమయం: పేరు, చిరునామా, అధికారి సెల్ నం: రెండింటికీ-SE, STSQM, HQ, CMC 9063836124.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, STSQM, HQ, CMC
DIPR.No.2177-PP/CL/Advt/1/2026-27, తేది: 08.05.2026

తెలంగాణ ప్రభుత్వం
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
క్ర.సం.1. NIT No.RFQ No.05/EE/SWM/MMC/2026-27 తేది: 07.05.2026
పనిపేరు: MMCలో దాని సంబంధమైన VFM మరియు PFM ఫాగింగ్ మెషీన్లకు మరమ్మతులు (రీ-కాల్). బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేది & సమయం : 08.05.2026 మ.3.00గం. నుండి ... చివరి తేది & సమయం: 15.05.2026 మ.03.00గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (SWM & TR) మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్, 1వ అంతస్తు, HUDA కాంప్లెక్స్, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్ నం. 9154768808. ఇ-మెయిల్ Id: eeswmtr@gmail.com. తదుపరి వివరాలు https://mmc.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (SWM & TR) MMC.
DIPR.NO. 2145-PP/CL/ADVT/1/2026-27 తేది: 08.05.2026

ఎఎస్సై శ్యామలకు డిజిపి అభినందన..

బేగంపేట మే 8,ప్రభాతవార్త : ఒక వైపు ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తూ వివిధ క్రీడలలో తన ప్రతిభను ప్రదర్శిస్తూ పోలీసు శాఖ కీర్తిని చాటుతున్నారు బేగంపేట ట్రాఫిక్ ఏఎస్సై వి.శ్యామల.తనలో ఉన్న ప్రతిభతో నేషనల్ వెపన్ షూటింగ్ లో పాల్గొన్న శ్యామల గోల్డ్ మెడల్ సాధించింది.అయితే జులైలో ఇంటర్నేషనల్ వెపన్ షూటింగ్ మాస్టర్ గేమ్స్ అథ్లెటిక్స్ జపాన్‌లో జరగనున్నాయి.ఆ పోటీలలో పాల్గొనడం వ్యయంతో కూడుకున్నది కావడంతో శ్యామల గురువారం డీజీపీ సీ.వీ.ఆనంద్‌ను కల్సింది.తన అభిలాషను వెల్లడించడంతో డీజీపీ ఆనంద్ తన వంతు కొంత ఆర్థిక సహాయాన్ని అందిస్తానంటూ తెలియజేయడంతో సంతోషం వ్యక్తం చేసింది. గతంలో కూడా తనకు ఆర్థిక సహాయం అందించి అండగా నిల్చి ప్రోత్సహించిన డీజీపీ కి ఈ సందర్భంగా శ్యామల కృతజ్ఞతలు తెలియజేసింది.ఈ సందర్భంగా తాను గతంలో సాధించిన మెడల్స్,అవార్డులు,సేవా రత్న,మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు వారు అందజేసిన డాక్టరేట్ ను డీజీపికి చూపించి ఆయన చేతుల మీదుగా అందుకున్నారు.ఇది తనకెంతో స్ఫూర్తి ఇచ్చిందని,శ్యామల తెలియజేసారు.ఈ సందర్భంగా కీప్ ఇట్ అప్ వెరీగుడ్ అంటూ డీజీపీ ఆనంద్ శ్యామల ను అభినందించడం పై ఆమె డీజీపీ కి కృతజ్ఞతలు తెలియజేసారు. తల్లిదండ్రులు లేని తనను ఇంతలా ప్రోత్సహిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు,తనను ప్రోత్సహిస్తున్న వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని శ్యామల తెలియజేసింది.శ్యామల భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు,మెడల్స్ సాధించాలని ఆశిద్దాం.

-రైఫిల్ షూటింగ్ మాస్టర్ గేమ్స్‌కు అండగా ఉంటానంటూ భరోసా

మౌలిక వసతుల కల్పనకు కృషి : కొలన్ హన్మంత్ రెడ్డి

శంకుస్థాపన చేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, మే 8, ప్రభాతవార్త

ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలను స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి బాచుపల్లి ప్రాంతంలోని కాకతీయ నగర్ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులను మంజూరు చేయించారు. ఈ మేరకు మంజూరైన నిధులతో శుక్రవారం రోడ్డు నిర్మాణ పనులకు కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కాలనీలో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులతో స్థానిక ప్రజలకు, విద్యార్థులకు, వాహనదారులకు రాకపోకలు సులభతరం కానున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులకు ఈ రోడ్డు నిర్మాణం శాశ్వత పరిష్కారంగా మారనుందని తెలిపారు. అనంతరం కాకతీయ నగర్ కాలనీ వాసులు అభివృద్ధి పనులకు చొరవ చూపిన కొలన్ హన్మంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ వీరేందర్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, జీతు, రాజేందర్, కాలనీ వాసులు రవి కృష్ణ, రమేష్ కోటి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాలి : ఆర్‌పిఐ డిమాండ్

సైఫాబాద్, మే 8 ప్రభాతవార్త: తమిళనాడులో ఏకైక అతిపెద్ద పార్టీ టివికె నాయకుడు జోసఫ్ విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆ రాష్ట్ర గవర్నర్ ఆహ్వానించకపోవడం రాజ్యాంగ నిబంధనలు, సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధంగా వ్యవహరించిన గవర్నర్ రాజేంద్రవిశ్వనాథ్ అర్లేకర్‌ను కేంద్రం వెంటనే వెనక్కి పిలవాలని భారత రిపబ్లికన్ పార్టీ (ఆర్‌పిఐ) డిమాండ్ చేసింది. గవర్నర్ వ్యవహరించిన తీరును ఆర్‌పిఐ తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు తీవ్రంగా ఖండించారు. గవర్నర్ తీరు తమిళనాడు ప్రజలను అవమానించడమేనని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకు గవర్నర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శాసన సభలో తన మేజార్టిని నిరూపించుకోవడానికి అతనికి తగినంత సమయం ఇవ్వడం అనేది ఒక సుస్థిరమైన ఆచారం, సంప్రదాయమన్నారు. మేజార్టిని లోక్‌భవన్‌లో కాకుండా శాసన సభలో నిరూపించుకోవాల్సి ఉంటుందని, గతంలో ఒకసారి సుప్రీంకోర్టు ఎస్.ఆర్.బొమ్మై కేసులో తీర్పు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. నాడు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రామ్‌లాల్ నుంచి ఆయన గుణపాఠం నేర్చుకోవాలని, ఎన్‌టిఆర్‌ను పదవి నుంచి తొలగించినందుకు ఆయనకు పదవి పోయిందని ఈ సందర్భంగా పద్మారావు వివరించారు. ఆర్‌పిఐ తరపున విజయ్‌కు మద్దతు తెలుపుతున్నామని, తక్షణమే విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఆహ్వానించాలని ఆయన డిమాండ్ చేశారు.

సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రతి కుటుంబం బాధ్యత

సెల్ఫ్ ఎన్యూమరేషన్ కార్యక్రమంలో పాల్గొన్న డిసి శ్రీనివాస్, పవన్ కుమార్

ఎల్.బి.నగర్, మే 8 ప్రభాతవార్త:
సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో ప్రతి కుటుంబం బాధ్యతగా తీసుకోవాలని సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ కార్యక్రమం కొత్తపేట డివిజన్ కమర్షియల్ ట్యాక్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ ప్రజల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి సక్రమంగా చేరే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, నివాసం తదితర సమాచారాన్ని సరైన విధంగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం భవిష్యత్తులో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సేవల విస్తరణలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధికారులు సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించి, మొబైల్, ఆన్‌లైన్ ద్వారా నమోదు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డిఈ చందన, సానిటరీ సూపర్వైజర్ బుచ్చయ్య, ఏఈ షరీఫ్, న్యాక్ ఇంజనీరింగ్ చాందిని, వినోద్, ప్రేమ్, కాలనీ అధ్యక్షులు అంజయ్య, నర్సింగ్ రావు, విశ్వేశ్వరయ్య, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలి: యశ్పాల్ గౌడ్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యశ్పాల్ గౌడ్

ఎల్.బి.నగర్, మే 8 ప్రభాతవార్త:
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపిరంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి బొల్లం యష్పాల్ గౌడ్ పేర్కొన్నారు. మోడీ సభ విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మోహన్ నగర్ లోని బిజెపి కార్యాలయంలో యశ్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. మూడవసారి ప్రధానిగా ఎన్నికైన తర్వాత మన ప్రియతమ నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ మొదటిసారి హైదరాబాద్ కు విచ్చేస్తున్న సందర్భంగా జరిగే సభకు వేలాదిగా తరలిరావాలని కోరారు. యువకులు, పెద్దలు కాలనీ అసోసియేషన్, యువజన సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు పెద్దఎత్తున విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా అధ్యక్షులు కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు రాజేందర్, కుల్కర్ణి, ఇప్ప వెంకటేష్, కొర్లపల్లి రాజు, సాయి కిరణ్, అవినాష్, సంప్రీతి, యశ్వంత్, విష్ణు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడికి సన్మానం

జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికుడు కృష్ణను సన్మానిస్తున్న శ్రీ పోచమ్మ దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, మే 8, ప్రభాతవార్త:
మలక్ పేట శ్రీ పోచమ్మ దేవాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికుడు కృష్ణను దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు దేవాలయంలో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపడుతున్న కృష్ణను సన్మానించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, బాల్ రాజ్ ,తాటికొండ శ్యామ్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి:ఎమ్మెల్యే బలాల

అజంపుర డివిజన్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల చిత్రంలో అబ్రార్ తదితరులు

మలక్ పేట, మే 8, ప్రభాతవార్త:
ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్ లోని పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ప్రజలు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించి మలక్ పేట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ,పలువురు నాయకులు, పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఏఎంసి వైస్ ఛైర్మన్ శ్రీనివాస్

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఏఎంసి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, మే 8 ప్రభాతవార్త: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్‌రెడ్డి, ఎస్సి సెల్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ నాగిళ్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన సందర్భంగా పి.సి.సి.మాజీ కార్యదర్శి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ బంజారాహిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో కలిసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ముద్దగౌని మనీష్ కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

-వాటర్ వర్క్స్ ఎండికి ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వినతి

వాటర్‌వర్క్స్ ఎండికి సమస్యల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సైదాబాద్, మే 8 ప్రభాతవార్త: ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం వాటర్‌వర్క్స్ ఎండి అశోక్‌రెడ్డిని కలిసి చర్చించారు. కర్మన్‌ఘాట్ క్రాంతినగర్‌లో ఉన్న కాలనీ బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరణ చేయాలని, పాత బకాయి బిల్లులను వాటర్ వర్క్స్ నుండి చెల్లిస్తే, తదుపరి వచ్చే బిల్లులను కాలనీ అసోసియేషన్ వారే కట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. సాగర్ కాంప్లెక్స్ నుండి వచ్చే డ్రైనేజీ నీరు అవుట్‌లేక గుర్రంగూడ ఫారెస్ట్, హరిహరపురం కాలనీలలో చేరుతుందని, ఇక్కడ ఉన్న రెండు చెరువులు మురికి కూపాలుగా మారుతున్నాయని, సమస్య శాశ్వత పరిష్కారానికి నూతన ట్రంక్ లైన్‌ను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. సరూర్‌నగర్ చెరువు వద్ద ప్రస్తుతం ఉన్న సివరేజ్ ప్లాంట్ సామర్థ్యాన్ని 2.5 ఎంఎల్‌డి నుండి 10 ఎంఎల్‌డికి పెంచాలని కోరారు. శివారు ప్రాంతంల్లో ఉన్న ప్రతి ఇంటికి త్రాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి, చంపాపేట డివిజన్ నాయకులు గండికోట శ్రీనాథ్, కాలనీ వాసులు ఆనంద్, దివాకర్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఘనంగా మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి వర్ధంతి వేడుకలు

ఉప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పి.జితేందర్‌రెడ్డి, పిల్లి నాగరాజు, అన్య బాలకృష్ణ తదితరులు

ఉప్పల్, మే 8 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, చిలుకానగర్, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉప్పల్‌లో బిఆర్ఎస్ సీనియర్ నేత పూడూరి జితేందర్‌రెడ్డి, పిల్లి నాగరాజు, అన్య బాలకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి రాజిరెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఉప్పల్ కారిడార్‌కు రాజిరెడ్డి పేరు పెట్టడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు చింతల నరసింహారెడ్డి, పంగ రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణామాచారి, పంగ మహేందర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. అదే విధంగా చిలుకానగర్‌లో బిఆర్ఎస్ నేత గుడి మధుసూధన్‌రెడ్డి, ఈరెల్లి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. బీరప్పగడ్డలో బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

రామంతాపూర్ డివిజన్‌లో..
రామంతాపూర్ డివిజన్‌లో బిఆర్ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు, పాలకూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామంతాపూర్ ప్రధాన రహదారిలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ దగ్గర బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బండారి రాజిరెడ్డి చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పాలకూరి సరిత, శ్రీకాంత్ గౌడ్, సంబటి నరేష్ ,ఆర్. శ్రీనివాస్ రెడ్డి, సూరం శంకర్, చాంద్ పాషా, కొప్పు నర్సింగ్ రావు, జహంగీర్, దయాకర్ రెడ్డి ,శంకర్ అన్న శ్రీకాంత్ గౌడ్, కిట్టు,జేసీబీ రాజు, మద్దూరి శ్రీనివాస్, మహేందర్, సాగర్, మనీష్ , మారుతీ, బాబురావు, వంశీ, మున్నా,ప్రేమ్ భాయ్ ,లడ్డు ,సురేష్, లక్ష్మి పాల్గొన్నారు.

యువత డ్రగ్స్ భారిన పడకుండా సమాజం మొత్తం కలిసి పనిచేయాలి : సీపీ సుమతి

: కరపత్రాలను ప్రదర్శిస్తున్న సీపీ సుమతి తదితరులు

హుడాకాంప్లెక్స్,8 మే, ప్రభాతవార్త : యువతను డ్రగ్స్ భారిన పడకుంగా కాపాడేందుకు సమాజం మొత్తం కలిసి పనిచేయాలని , డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని మల్కాజ్‌గిరి సీపీ సుమతి పేర్కొన్నారు. గురువారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లో నార్కొటిక్,ఈగల్‌టీంలో కలిసి హాస్టల్ నిర్వాహకులతో సీపీ అవగాహణ సధస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ డ్రగ్స్‌పై ప్రభుత్వం కఠినంగా ఉందన్నారు. కేవలం పోలీసుల వల్లనే డ్రగ్స్ నిక్మూలన సాధ్యం కాదని, ప్రజల సహకారం కూడ అవసరమన్నారు. సమాజాన్ని డ్రగ్స్ రహిత ంగా మార్చేందుకు పౌరులు పోలీసులకు హకరించాలని కోరారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోని 630 హాస్టల్స్‌లలో ఉంటున్న దాదాపు 30వేల మంది విద్యార్థుల భద్రతపై చర్చించారు. యువత తపుత్రోవ పట్టకుండా అవగాహన సధస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ నిర్వాహకులకు డ్రగ్స్ వలన కలిగే ప్రమాదాలు , యువత భవిష్యత్తుపై పడే ప్రభావల గురించి వివరించారు. నిర్వాహకులు నిబంధలను పాటించాలని కోరారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ కరపత్రాలను, ప్రత్యేక బుక్లెట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల బివిష్యత్తుకు భరోసానివ్వడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.మేరుగైన సేవలు అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని సీపీ సుమతి స్పష్టం చేశారు. ఈ సధస్సులో డీసిపి అనురాధ, సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి చొరవతో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ళ సమస్య పరిష్కారం

విశాఖనగర్‌లో రోడ్డుకు సమాంతరంగా మ్యాన్‌హోళ్ళ నిర్మింపజేసి సమస్యను పరిష్కరించిన నవారు మల్లారెడ్డి కాలనీవాసులతో కలిసి పరిశీలిస్తున్న దృశ్యం

సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్‌లోని అల్మాస్‌గూడ విశాఖనగర్ ఫేజ్-1 కాలనీలో గడచిన ఆరు నెలలుగా ప్రజలకు ఇబ్బందికరంగా, ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారిన నడి రోడ్డుపై డ్రైనేజీ మ్యాన్‌హోళ్ళ సమస్య ఎట్టకేలకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి చొరవతో పరిష్కారం అయ్యింది. కాలనీలో ఆరు నెలల క్రితం అప్పటి అధికారులు కాంట్రాక్టర్‌తో 300 మీటర్ల మేర బిటి రోడ్డును నిర్మించినా అక్కడి డ్రైనేజీ మ్యాన్‌హోళ్ళను రోడ్డుకు సమాంతరం చేయించలేదు. అయితే రోడ్డుపై రాకపోకలు ప్రారంభమైనా రోడ్డుకు మధ్యలో దిగువగా ఉన్న పలు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. దీంతో స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చినా అప్పట్లో ఎవరూ స్పందించలేదు. కాంట్రాక్టర్ సైతం పట్టించుకోలేదు. బిటి రోడ్డుపై మధ్యలో గుంతలమారిన ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోళ్ళ వల్ల ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారడంతో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అంతే కాకుండా బిటి మెటీరియల్ వల్ల డ్రైనేజీ మూతలు తెరచుకోకపోవడంతో డ్రైనేజీలు నిండిపోయాయి. ఈ మేరకు స్థానిక కాలనీవాసులు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి దృష్టికి సమస్య తీసుకురాగా ఆయన కాలనీలో పర్యటించి రోడ్డు నిర్మాణం సందర్భంగా సరిచేయని డ్రైనేజీ మ్యాన్‌హోళ్ళను పరిశీలించారు. అనంతరం మల్లారెడ్డి బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, డిఇ అభినయ్‌కుమార్‌లను కలిసి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన డిసి విశాఖనగర్‌లో రోడ్డు నిర్మాణం సందర్భంగా వదిలివేసిన డ్రైనేజీ మ్యాన్‌హోళ్ళను నిర్మించడానికి చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంతో గత రెండు రోజులుగా కాలనీలోని దాదాపు 15 మ్యాన్‌హోళ్ళను శుభ్రం చేసి రోడ్డుకు సమాంతరంగా వాటిని నిర్మించే పనులు జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం నవారు మల్లారెడ్డి కాలనీలో పర్యటించి డ్రైనేజీ పనులను పరిశీలించారు. ప్రజా సమస్యల పట్ల సర్కిల్ అధికారులు సత్వరమే స్పందించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే తమ వినతికి స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయించి ప్రమాదకర మ్యాన్‌హోళ్ళను పునర్నింపజేసిన కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డికి అదే విధంగా సమస్య పరిష్కారం పట్ల చొరవ చూపిన డిసి సమ్మయ్యకు, డిఇఇ అభినయ్ కుమార్, ఎఇకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, సౌత్ కాలనీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో పాటు విష్ణుచారి, బాబూరావు, యాదగిరి, ప్రసాద్‌చారి, తిరుపతియాదవ్, దీపక్, మాధవరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ బహిరంగ సభను జయప్రదం చేయాలి

వాకర్స్‌కు ప్రధాని నరేంద్రమోడీ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను అందజేసి విజయవంతం చేయాలని కోరుతున్న అందెల శ్రీరాములు యాదవ్: చిత్రంలో మీర్‌పేట్ బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త: ఈ నెల పదవ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ రాష్ట్ర బిజెపి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రధాని నరేంద్ర మోడి బహిరంగ సభను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ జిల్లెలగూడ, మీర్‌పేట్ చెరువు వద్ద వాకర్స్‌ను కోరారు. సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని జయప్రదం చేసే ప్రయత్నాల్లో భాగంగా శుక్రవారం జిల్లెలగూడ చందన చెరువు కట్టపై అదే విధంగా మీర్‌పేట్ పెద్ద చెరువు వద్ద ఆయన మార్నింగ్ వాక్ చేసి ప్రచారం చేశారు. స్థానిక మీర్‌పేట్ బిజెపి సెక్టార్‌ల బిజెపి అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజ్, పసునూరి బిక్షపతిచారి చారిల ఆధ్వర్యంలో ఆయా చెరువు వద్ద వాకింగ్ చేస్తూ మార్నింగ్ వాకర్స్‌ను పలకరించారు. ఈ సందర్భంగా మోడీ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన సభ గురించి వివరించి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో మేకల రవీందర్‌రెడ్డి, సూల ప్రభాకర్, మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి, కొండ్రు గౌరీ శంకర్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, సిద్దాల శ్రీనివాస్, కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, గాజుల మధు, గడ్డం జగన్, బచ్చనమోని కాశీరాం యాదవ్, జగన్ ముదిరాజ్, తుమ్మల రమేష్ ముదిరాజ్, వలభోజు గోపినాథ్, వేణుగోపాల్‌రెడ్డి, రఘు, శ్రీశైలం యాదవ్, వంటేరు నర్సింహారెడ్డి, హైందవిరెడ్డి, మల్లారెడ్డి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు పారిజాత నర్సింహారెడ్డి సన్మానం

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త:
మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ శాఖమాత్యులు, హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసారు. బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయానికి తరలివెళ్ళిన ఆమె అక్కడ పొన్నంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్ తదితరులు కూడా ఉన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి : హరిగౌడ్

కరపత్రాలు పంపిణీ చేస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు లింగాల హరిగౌడ్

సైదాబాద్, మే 8 ప్రభాతవార్త: ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు లింగాల హరిగౌడ్ కోరారు. మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని తెలంగాణా పర్యటనలో దాదాపు రూ.8 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందన్నారు. రూ.1,695 కోట్లతో నిర్మించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును జాతికి అంకితం చేస్తారని అన్నారు. ప్రపంచ దేశాలంతా ప్రధాని నరేంద్రమోడి పాలనకు కితాబు ఇస్తుంటే మన దేశంలోని ప్రతిపక్షాలు మాత్రం దేశాభివృద్ధికి అడ్డుపడుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా దేశ ప్రజలంతా ప్రధాని నరేంద్ర మోడి వెంటే ఉన్నారనడానికి పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు.రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో బిజెపి తప్పని సరిగా విజయం సాధిస్తుందన్నారు. ప్రజలంతా స్వచ్ఛందంగా ప్రధాని బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని హరిగౌడ్ కోరారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

సుపరిపాలన మోడీతోనే సాధ్యం : ఎన్వీఎస్ఎస్

రామంతాపూర్‌లో మోడీకి మద్దతుగా ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్, బండారు శ్రీవాణి తదితరులు

రామంతాపూర్, మే 8 ప్రభాతవార్త :
ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం రామంతాపూర్‌లో గోడ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, రామంతాపూర్ మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు, డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా, ముత్తినేని జగదీష్, వల్లపుజగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం, బలమైన భారత నిర్మాణం కోసం ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సంకూరి కుమారస్వామి, ఉలుగొండ నారాయణదాసు, వేముల తిరుపతయ్య, బొడ్డుపల్లి శ్రీనివాస్, కామేశ్వరరావు, తమ్మలి రవి, ప్రభు లింగం, దేవా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ సభ విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ

మోడీ సభ విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న బిజెపి డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా తదితరులు

రామంతాపూర్, మే 8 ప్రభాతవార్త : భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ సందర్భంగా రామంతాపూర్‌లోని పలు ప్రాంతాల్లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మోదీకి మద్దతుగా ప్రతి ఒక్కరూ ఈ సభకు తరలివచ్చి దిగ్విజయం చేయాలని కోరారు. దేశం కోసం మోదీ మోదీ కోసం మనం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు తాళ్ల బాలకృష్ణ గౌడ్, వెంపటి శ్రీనివాస్, కొంపల్లి ఉపేందర్, మామిళ్ళ నందకిషోర్ యాదవ్, శాగ రవీందర్, దర్శనాల సుధాకర్, ఉపేందర్ యాదవ్, వేముల వెంకట్ రెడ్డి, బొడ్డుపల్లి లింగం పాల్గొన్నారు.

స్వయం గణనలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలి : డిసి జాకీయ సుల్తానా

-అవగాహన కల్పించేందుకు మల్కాజిగిరిలో 2కే రన్



నేరెడ్ మెట్ , మే 8: ప్రభాతవార్త : ప్రజల్లో స్వయం గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్)పై అవగాహన పెంపొందించేందుకు మల్కాజిగిరి సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహినట్లు డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు . శుక్రవారం సఫీల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్ నుంచి మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, యువత, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాకియ సుల్తానా మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రణాళికల్లో జనాభా గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు స్వయం గణన ప్రక్రియను బాధ్యతగా తీసుకుని కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు ఈ గణాంకాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.స్వయం గణన కార్యక్రమం ఈ నెల 26 నుంచి 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేయడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు సమాచారంలో ఖచ్చితత్వం పెరుగుతుందన్నారు. యువత, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో మంచి స్పందన లభించిందని అధికారులు తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోడీ సభకు తరలిరావాలి : జక్కిడి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జక్కిడి తదితరులు.

వనస్థలిపురం మే8,ప్రభాతవార్త
ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మే10న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్న సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ సభకు సంబంధించి వనస్థలిపురం డివిజన్ లో బిజెపి నేతలు సన్నాహక సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మోడీ రాష్ట్ర పర్యటనను పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని అన్ని పార్కులలో ప్రచారం నిర్వహించి వాకర్స్ ను ఆహ్వానించామని చెప్పారు. యువత బైక్ ర్యాలీలు.. మహిళలు ముగ్గులు పలు వినూత్న కార్యక్రమాలతో డివిజన్ ప్రజలను సభకు హాజరుకావాలని కోరామన్నారు. సభకు తరలివచ్చే వారికోసం వనస్థలిపురం కాంప్లెక్స్, ఎఫ్సీఐ కాలనీ కమ్యూనిటీ హాల్, క్రాంతి హిల్స్ కమ్యూనిటీ హాల్, శ్రీనివాసపురం కమ్యూనిటీ హాల్, హస్తినాపురం సిగ్నల్ వద్ద బస్‌లను పాయింట్లు ఏర్పాటు చేసామన్నారు. డివిజన్ నుండి సుమారు 500 మంది సభకు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. దేశం, దేశ ప్రజల కోసం పనిచేసే ప్రధానమంత్రి కోసం స్వచ్ఛందంగా వెళ్లి ఆయన సందేశాన్ని విని మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో తరలివెళ్లి సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు కాటన్ క్రాంతి గౌడ్, మాజీ కౌన్సిలర్ నీళ్ళ అంజన్ కుమార్ గౌడ్, టీ. విజయ్ కుమార్. అరుణ్ జోగి, రామాంజనేయులు గౌడ్ తదితరులు ఉన్నారు

ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్త కుర్మా సత్తయ్య

తుర్కయంజాల్ మే 8 (ప్రభాతవార్త) రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేసిందని తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం పిఏసి ఛైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అన్నారు. ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధిలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోహెడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అదేవిధంగా రూ. 500 రూపాయల బోనస్ అందజేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేసుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులకు అండగా ఉండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాడని దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం పి ఐ సి డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, కొత్త రామ్ రెడ్డి, కృష్ణారెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు

రెస్టారెంట్ సిబ్బందిపై దాడి కేసులో నిందితులకు రిమాండ్

హుడాకాంప్లెక్స్,08 మే, ప్రభాతవార్త :అడిగినంత మేరకు డిస్కౌంట్ ఇవ్వనందుకు రెస్టారెంట్ సిబ్బంధిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు ప్రధాన నిందితులను సరూర్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.ఎస్ఐ మారయ్య ఇచ్చిన సమాచారం మేరకు బైరామల్‌గూడ లోని అర్బన్ బీట్ బార్ అండ్ రెస్టారెంట్‌కు ప్రసన్‌రెడ్డి, ఏదుల యశ్వంత్‌రెడ్డి కొందరు అనుచరులతో వచ్చి అడిగినంత డిస్కౌంట్ ఇవ్వనందుకు సిబ్బంధిపై దాడి చేశారు. రెస్టారెంట్ వారి పిర్యాదు మేరకు కపసు నమోదు చేసిన సరూర్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ అధారంగా నిందితులను గుర్తించారు.పరారీలో ఉన్న ప్రధాన నిందితులు ప్రసన్‌రెడ్డి,యశ్వంత్‌రెడ్డి మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదు అయి ఉన్నందున ఇద్దరు ప్రధాన నింధిలును రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురికి నోటీసులు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు

సమస్యలు పరిష్కరించాలని వినతి

జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న పున్న గణేష్ నేత

ఎల్.బి.నగర్, మే 8 ప్రభాతవార్త:
ఏదైనా పరిధిలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ విజ్ఞప్తి చేశారు. పున్న గణేష్ నేతృత్వంలో ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోని కలిసి కాలనీలలో ఉన్న సమస్యల గురించి శాలువాతో సన్మానించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయపురికాలనీ రోడ్ నెంబర్ 2లో నాలా పనులు మధ్యలో నిలిపివేసి మట్టికుప్పలు తొలగించలేదని, వాసవికాలనీ రోడ్ నెంబర్ 1/ఎ సిసిరోడ్డుకు కావలసిన నిధులు మంజూరు చేసి టెండర్ పూర్తిచేసి వర్షాకాలానికి ముందే రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరారు. అందుకు స్పందించిన జోనల్ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బిసి నాయకులు గట్ల రవీంద్ర, ఆనందకుమార్, వాసవికాలనీ రోడ్ నెంబర్ 1/ఎ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెల్లా జగన్నాథం, కార్యదర్శి మల్లేష్ యాదవ్, లింగారెడ్డి, శ్రీధర్ రెడ్డి, అచ్చయ్య, పాల్గొన్నారు.

యాప్రాల్‌లో చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి



నేరెడ్ మెట్ మే 8, ప్రభాతవార్త : వేసవి తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించే ఉద్దేశంతో యాప్రాల్‌లో బిఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎండాకాలంలో ప్రజలకు చల్లని తాగునీరు అందించడం ఎంతో సేవామయమైన కార్యక్రమమని పేర్కొన్నారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రజలకు ఉపశమనం కలిగించే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.